సాక్షి తిరుపతి

ఆదివారం । 15 । జనవరి । 2023



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.58,530
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,228
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.71,100
రిటైల్ వెండి గ్రాము	రూ.73.10

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	32	16
చిత్తూరు	31	15
తిరుమల	27	11
గూడూరు	31	17
నగరి	32	16



తిరుపతి అర్బన్: కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి కుటుంబ సమేతంగా శనివారం భోగి వేడుకల్లో పాల్గొన్నారు. తన బంగ్లా ముందు భోగిమంట వేసి పండగ చేసుకున్నారు. సంక్రాంతి, కనుమ పండుగలను ప్రజలందరూ ఘనంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

న్యూస్‌రీల్

రేపటి స్పందన రద్దు

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించనున్న స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం కనుమ పండుగను పురస్కరించుకుని స్పందన కార్యక్రమాన్ని రద్దు చేశామని ఆయన పేర్కొన్నారు.

వైభవంగా గోదాదేవి కల్యాణం



స్వామి, అమ్మవార్ల క్షేత్రోత్సవం

రాపూరు: పెంచలకోనలో శనివారం శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి, గోదాదేవి కల్యాణ్యాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. గోదాదేవి 30 రోజులపాటు ధనుర్మాస వ్రతాన్ని ఆచరించి స్వామివారిలో భోగిపండుగనాడు ఐక్యమైనందుకుగాను కల్యాణోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ మేరకు ఉదయం తిరుచ్చిపై గోదాదేవిని, పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి కోన మాడ వీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. అనంతరం కల్యాణం జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు.

రంకేసిన పౌరుషం!



భోగి పండుగను పురస్కరించుకుని శనివారం చంద్రగిరి నియోజకవర్గం, రామచంద్రాపురం మండలంలోని అనుప్పల్లిలో ఎడ్ల పందాలు నిర్వహించారు. ఉదయం పశువుల కొమ్ములకు రంగులు పూసి ముస్తాబుచేశారు. తర్వాత కొయ్యతో చెక్కిన పలకలు, రంగు కాగితాలు, వివిధ రకాల దేవుళ్ల బొమ్మలను అతికించి దప్పులు కొట్టి పశువులను జనంలోకి వదిలారు. యువకులు వాటిని అడ్డగించి పలకలను కైవశం చేసుకునేందుకు పోటీపడ్డారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో జనం తరలివచ్చి ఎడ్లపందాలు తిలకించి మురిసిపోయారు.
- రామచంద్రాపురం

హోరాహోరీగా కబడ్డీ పోటీలు



వాకాడు: మండలంలోని దుగ్గరాజపట్నం గ్రామంలో శనివారం స్థానిక యూత్ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు అట్టహాసంగా జరిగాయి. వాకాడు, కోట, చిట్టమూరు మండలాల నుంచి 25 జట్లు టోర్నీలో పాల్గొన్నాయి. ఈ పోటీలు రెండురోజుల పాటు జరగనున్నాయి.

భోగి మంటల వెలుగులు



తిరుమల శ్రీవారి ఆలయం ఎదుట భోగి మంటలు


సంక్రాంతి సంబరాల్లో భాగంగా మొదటి రోజు శనివారం జిల్లా వ్యాప్తంగా భోగి పండగను ఘనంగా జరుపుకున్నారు. తిరుమల శ్రీవారి ఆలయం ఎదుట శనివారం వేకువజామున సంప్రదాయబద్ధంగా భోగి మంటలు వేశారు. టీటీడీ సెక్యూరిటీ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

పండగపూటా

ఏడుపేనా బాబు?

'సంక్రాంతి పండుగను తెలుగువారు ఎంతో ఘనంగా జరుపుకుంటారు. ఈ పండగ పూటా నీచ రాజకీయాలేనా. పండగ కోసం తన సొంతూరు నారావారిపల్లెకొచ్చినా నన్ను గుర్తుచేసుకుని ఏడవడమేనా..?. ఆయనకు ఎప్పుడూ ఏడుపే తప్ప సంతోషం ఉండదు. క్యారెక్టర్‌లేని మనిషి. జిల్లాలో పుట్టి.. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసినావు.. ఏం ప్రయోజనం..? జిల్లాకు ఒక్క మంచిపనిచేశావా..? ఈ జిల్లాకు నువ్వు భారమా.. నేనుభారమా.. ప్రజాక్షేత్రంలో తేల్చుకుందాం రా..?' అంటూ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సవాల్ విసిరారు. శనివారం ఆయన సదుం మండలం, ఎర్రాతివారిపల్లెలో విలేకరులతో మాట్లాడారు.

- నారావారిపల్లెలోనూ చంద్రబాబు నన్నే గుర్తుకు తెచ్చుకుంటున్నారు
- 14 ఏళ్లు జిల్లాకు ఏం చేశారో చెప్పాలి?
- నీవు వలస పక్షివి.. జిల్లాకు భారం తప్ప ప్రయోజనం లేదు
- నేను ఇక్కడే పుట్టి ప్రజల రుణం తీర్చుకుంటున్నా
- మంత్రి పెద్దిరెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సదుం: సంక్రాంతి పండుగను అందరూ ఎంతో ఆనందోత్సాహాలతో జరుపుకుంటుంటే టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తనపై పడి ఏడుస్తున్నారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎద్దేవా చేశారు. సదుం మండలం, ఎర్రాతివారిపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కుట్రలు, కుతంత్రాలు, మానిప్యులేషన్లనే నమ్ముకున్న చంద్రబాబుకు ఎప్పుడూ ఏడుపే తప్ప సంతోషం ఉండదన్నారు. చిత్తూరు జిల్లాలో ఎప్పుడూ చంద్రబాబు మెజార్టీ సాధించకపోవడం.. మరోవైపు అధికారం పోయిందనే బాధతో పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

బాబూ.. చిత్తూరు జిల్లాకు ఏం చేశావ్?

చంద్రబాబు చిత్తూరు జిల్లాకు ఏం చేశాడంటే చెప్పుకోవడానికి ఒక్క మేలు కూడా లేదని మంత్రి ఎద్దేవా చేశారు. ఒక్క గుర్తుండే సంక్షేమ పథకమైనా.. ఒక్క అభివృద్ధి కార్యక్రమమైనా చేసినట్లు నిరూపించగలవా? అని ప్రశ్నించారు. జిల్లావాసి కాకపోయినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతగల సీఎంగా చిత్తూరు జిల్లాతోపాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాలను సమానంగా చూస్తూ అభివృద్ధి చేస్తున్నారని స్పష్టం చేశారు. ఆఖరికి కుప్పానికి కూడా ఎంతో చేశారని తెలిపారు. కుప్పం మున్సిపాలిటీ, రెవెన్యూ డివిజన్ చేసిన విషయం గుర్తుకు రాలేదా..? అని ప్రశ్నించారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉండి కూడా చంద్రబాబు ఎందుకు చేయలేకపోయాడని ప్రశ్నించారు. చిత్తూరు జిల్లా అభివృద్ధి విషయంలో సీఎం వైఎస్ జగన్ తనకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారని, తాము అడిగినవన్నీ మంజూరు చేస్తున్నారని వివరించారు. చంద్రబాబు, చిత్తూరు జిల్లాకు ఏంచేశాడో ప్రజలకు సమాధానం చెప్పాలని నిలదీశారు. కుప్పానికి 20 వేల ఇళ్లు, హంద్రీ- నీవా ప్రాజెక్ట్ పనులు కనబడలేదా..? అని ప్రశ్నించారు. టీడీపీ కార్యకర్తలు అరాచకాలుచేసి ప్రజలను ఆస్పత్రిపాలు చేస్తుంటే చూస్తూ ఊరుకోవాలా? అని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా ఉన్నప్పటి నుంచి చంద్రబాబు తనపై పైచెయ్యి సాధించలేకపోయారని గుర్తుచేశారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పార్టీ పెట్టాక.. టీడీపీ నామరూపాలు లేకుండా పోయిందని.. ఇంకా ఏదైనా మిగిలుంటే, దాన్నికూడా వచ్చే ఎన్నికల్లో తుడిచేస్తామని స్పష్టం చేశారు.

జిల్లాకు ఎవరు భారమో తేల్చుకుందాం రా?

'జిల్లాకు నువ్వు భారమా, నేను భారమా ప్రజాక్షేత్రంలో తేల్చుకుందాం రా' అంటూ మంత్రి పెద్దిరెడ్డి టీడీపీ అధినేత చంద్రబాబుకు సవాల్ విసిరారు. ఇక్కడ పుట్టి.. ఏ ఒక్క మేలూ చేయని చంద్రబాబే ఈ జిల్లాకు భారం అని, తాను ఈ జిల్లాలో పుట్టినందుకు ప్రజల రుణం తీర్చుకుంటున్నానని, మరి నీవు ఎందుకు చేయలేదు..? అని నిలదీశారు. చంద్రబాబు ఇక్కడ పుట్టాడు కానీ, ఈ జిల్లాలో ఉండరని, ఇక్కడి ప్రజల కోసం ఏమీ చేయరని తేల్చిచెప్పారు. అతను ఒక వలస పక్షిలా తిరుగుతుంటాడని, సొంత జిల్లాపై బాబుకు ఏ మాత్రం ప్రేమ, మమకారం లేదని వివరించారు.

వైభవంగా మకర జ్యోతి దర్శనం



శివాలయం వద్ద భారీ కర్పూర జ్యోతి దర్శనం

వాకాడు: కేరళలోని శబరిమల అయ్యప్పస్వామి మకరజ్యోతి దర్శనం సందర్భంగా శనివారం వాకాడులోని శ్రీ నాగేశ్వరస్వామి (శివాలయం) వద్ద స్థానిక అయ్యప్ప భక్తులు కర్పూర జ్యోతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. శివాలయం ముందు భాగంలో స్థూపాన్ని ఏర్పాటు చేసి దాదాపు 20 కిలోల కర్పూరాన్ని ఉంచి శబరిమలలో జ్యోతి దర్శనం సమయానికి వెలిగించి దర్శించుకున్నారు. అలాగే స్థానిక చెన్నకేశవ స్వామి ఆలయం వద్ద అయ్యప్పభక్తులు మకర జ్యోతి వేడుకలు జరుపుకున్నారు. ప్రత్యేక సంగీత వాయిద్యాలతో అయ్యప్పస్వామి పడి పూజ నిర్వహించారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక అభిషేకాలు



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో 16 కాళ్ల మండపంలోని అయ్యప్పస్వామికి శనివారం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మకరజ్యోతి పురస్కరించుకుని పంచామృతం, కలశ జలాలతో అభిషేకం చారు. అనంతరం సుందరంగా అలంకరించి, విశేష పూజలు చేశారు. ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ప్రత్యేక ఆహ్వానితులు చింతామణి పాండు, అధికారులు సతీష్‌మాలిక్, హరియాదవ్, వేదపండితులు అర్ధగిరిస్వామి, అర్చకులు గోవిందశర్మ, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా భోగితేరు



భోగితేరుపై ఊరేగుతున్న ఆండాళ్ అమ్మవారు, శ్రీకృష్ణస్వామి

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో భోగి పండుగను పురస్కరించుకుని శనివారం భోగితేరు వైభవంగా నిర్వహించారు. సంక్రాంతి పర్వదినాలలో భాగంగా తొలి రోజు వచ్చే భోగి పండుగనాడు గోవిందరాజస్వామి ఆలయంలో భోగితేరు ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఉదయం ఆలయంలోని శ్రీఆండాళ్ అమ్మవారు, శ్రీకృష్ణస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆండాళ్ అమ్మవారిని, శ్రీకృష్ణస్వామి వారిని భోగితేరుపై కొలువుదీర్చారు. మంగళవాయిద్యాల నడుమ భోగితేరు ఊరేగింపు చేపట్టారు. పెద్ద మాడవీధి, కర్ణాల వీధి, భేరివీధి, గాంధీ రోడ్డు మీదుగా ఆలయం వరకు భోగితేరు ఊరేగింపు ఉత్సవం నిర్వహించారు. ఆలయ డెప్యూటీ ఈఓ వీఆర్. శాంతి, ఏఈఓ రవికుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్ మోహన్‌రావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాదమూర్తిరాజు పాల్గొన్నారు.

రేపు గోదా పరిణయోత్సవం

శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో సోమవారం గోదా పరిణయోత్సవం ఘనంగా చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఉదయం పుండరీకవల్లి అమ్మవారి ఆలయం నుంచి మేల్‌చాట్ వస్త్రం, పూలమాల ఊరేగింపుగా తీసుకెళ్లి శ్రీఆండాళ్ అమ్మవారికి సమర్పిస్తారు. సాయంత్రం శ్రీగోదా పరిణయోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు సోమవారం కనుమ రోజున నిర్వహించే పార్వేట ఉత్సవాన్ని టీటీడీ రద్దుచేసింది.

భోగి సంబరాల్లో మంచు కుటుంబం



భోగి మంటలు వేస్తున్న మంచు మోహన్‌బాబు, మంచు విష్ణు తదితరులు

చంద్రగిరి: ప్రముఖ సినీ హీరో, ఎంబీయూ యూనివర్సిటీ చాన్స్‌లర్ మంచు మోహన్‌బాబు శనివారం కుటుంబ సమేతంగా భోగి వేడుకల్లో పాల్గొన్నారు. మండల పరిధిలోని ఏ.రంగంపేట సమీపంలోని ఎంబీయూ యూనివర్సిటీలో శనివారం తెల్లవారుజామున ప్రోచాన్స్‌లర్ మంచు విష్ణుతో కలిసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మోహన్‌బాబు మాట్లాడుతూ ప్రజలందరూ క్షేమంగా ఉంటే మనం క్షేమంగా ఉంటామన్నారు. భోగి పండుగ విశిష్టత గురించి అందరికీ తెలిసిందేనన్నారు. కోడి పందాలు తప్పు... ఒప్పా అంటే అది మొదటి నుంచి వస్తున్న ఆచారమని పేర్కొన్నారు. కత్తులు కట్టకుండా కోడి పందాలు పెడితే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. సంస్కృతిని మర్చిపోకుండా తల్లిదండ్రులు ఆత్మీయులు, స్నేహితులతో కలిసి సంక్రాంతి జరుపుకోవాలన్నారు. అందరికీ భోగి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తన కొత్త చిత్రం మార్చిలో ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు.

కోడి పందెం స్థావరాలపై దాడులు



గూడూరు: పోలీసుల అదుపులో జూదరులు



వెంకటగిరి: పందెం రాయుళ్లు, కోళ్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు

గూడూరురూరల్ : మండలంలోని అయ్యవారిపాళెం గ్రామ సమీపంలో శనివారం సాయంత్రం కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో రూరల్ ఎస్‌ఐ బ్రహ్మనాయుడు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 8 మందిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. అదేవిధంగా 13 మోటారు సైకిళ్లు, ఒక ఆటో, 9 సెల్ ఫోన్లు, 5 పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ బ్రహ్మనాయుడు తెలిపారు.

వెంకటగిరిలో..

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి) : బాలాయపల్లి మండలం, జార్లపాడు గ్రామంలో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరాలపై బాలాయపల్లి ఎస్‌ఐ వీరనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నలుగురు జూదరులు, కోళ్లు, రూ.4,380 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కోడిపందెం రాయుళ్ల అరెస్ట్

వెంకటగిరిరూరల్: మండలంలోని పారవోలు గ్రామంలో కోడిపందేల స్థావరాలపై ఎస్‌ఐ జిలానీ ఆధ్వర్యంలో శనివారం దాడులు నిర్వహించారు. ఏడుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.3,300 నగదు స్వాధీన పరుచుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

చంద్రగిరి: కోడిపందేలు ఆడుతున్న జూదగాళ్లను చంద్రగిరి పోలీసులు శనివారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు. చంద్రగిరి రైల్వే స్టేషన్ సమీపంలో కోడి పందేలు జరుగుతున్నట్లు సమాచారం రావడంతో సీఐ ఓబులేసు ఆధ్వర్యంలో ఎస్‌ఐ వంశీధర్ తన సిబ్బందితో కలిసి దాడులు చేపట్టారు. పోలీసుల రాకను పసిగట్టిన పందెం రాయుళ్లు అక్కడ నుంచి పరుగులు తీశారు. ఈ క్రమంలో ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకుని రూ.2,200 నగదు, సుమారు 10 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

యువకుడి మృతిపై కేసు



మృతుడు వెంకటేష్

నాయుడుపేట టౌన్: పట్టణ పరిధిలోని లోతువాని గుంట కాలనీకి చెందిన రెడ్డి వెంకటేశ్వర్లు అలియాస్ వెంకటేష్ (23) మృతిపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం.. లోతువానిగుంట కాలనీకి చెందిన రెడ్డి రవి, బుజ్జమ్మ దంపతుల కుమారుడు వెంకటేష్ కూలి పనులు చేసుకుంటూ తల్లిదండ్రులతో కలసి ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి అతిగా మద్యం సేవించి కాలనీ సమీపంలోని ఆలయం వద్ద పడిపోయాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతన్ని స్థానికులు గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వగా.. వారు మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ మేరకు మృతుని పెద్దమ్మ అల్లెమ్మ శనివారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రేణిగుంట: మండలంలోని అత్తూరు పంచాయతీ, మొలగమూడి సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైనట్లు గాజులమండ్యం ఎస్‌ఐ ధర్మారెడ్డి తెలిపారు. గ్రామ శివారున గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్‌ఐ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతేడు సుమారు 40–45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి పచ్చరంగు షర్టు, ఎరుపు రంగు నిక్కరు ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థి అదృశ్యంపై ఫిర్యాదు

కోట: బీటెక్ చదువుతున్న తన కుమారుడు చంద్రమోహన్ ఈ నెల 10వ తేదీ నుంచి కనిపించడం లేదని కేసవరానికి చెందిన బండి చెంచయ్య శనివారం స్థానిక ఎస్‌ఐ పుల్లారావుకు ఫిర్యాదు చేశారు. తండ్రి కథనం మేరకు.. గూడూరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీటెక్ సెకండియర్ చదువుతున్న తన కుమారుడు చంద్రమోహన్ ఈనెల 10వ తేదీ రోజూలాగే కళాశాలకు వెళ్తున్నట్టు చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. అప్పటి నుంచి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వెదికినా ఆచూకీ లభించలేదు. కళాశాలకు వెళ్లి విచారించగా ఆ రోజు కళాశాలకు రాలేదని అక్కడి సిబ్బంది చెప్పారు. చంద్రమోహన్ అదే రోజు స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడుతున్నట్లు గ్రామంలో కొందరు చెప్పారు. క్రికెట్ ఆడుతుండగా జరిగిన గొడవలో ఇద్దరు యువకులు చంద్రమోహన్ ఫోన్ లాక్కుని కొట్టినట్లు తెలిసింది. వారిని విచారించి తన కుమారుడి ఆచూకీ కనుగొనాలని ఆయన ఎస్‌ఐని ప్రాధేయపడ్డారు. ఎస్‌ఐ స్పందిస్తూ వెంటనే విచారణ చేపడతామని చెప్పారు.

భక్తిపరవశం.. మకరజ్యోతి దర్శనం

- ఘనంగా తిరు ఆభరణాల ఊరేగింపు
- జన సంద్రంమైన ఎర్రాతివారిపల్లె



ఆభరణాల ఊరేగింపులో భక్తజన సందోహం



తిరు ఆభరణాలను ఊరేగింపుగా తీసుకువస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి, తిరు ఆభరణాల అలంకారంలో అయ్యప్పస్వామి

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లె కోటమలై అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం మకరజ్యోతిని దర్శించుకుని భక్తులు భక్తిపారవశ్యంతో తన్మయత్వం చెందారు. అంతకుముందు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి స్థానిక సదుమమ్మ ఆలయంలో తిరు ఆభరణాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వాటిని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎంపీ మిథున్ రెడ్డి తలపై ఉంచగా కేరళ వాయిద్యాలు, ప్రత్యేక గొడుగుల మధ్య ఊరేగింపుగా అయ్యప్ప స్వామికి సమర్పించారు. తిరు ఆభరణాలను అలంకరించిన అనంతరం ఆలయ మేల్‌శాంతి నారాయణన్ నంబూద్రి ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. ఆలయానికి తూర్పు దిక్కున ఉన్న కొండల్లో సాయంత్రం మకరజ్యోతి దర్శనం ఇచ్చింది. జ్యోతి దర్శనం అనంతరం మంత్రి పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో కర్పూర జ్యోతులు వెలిగించారు. ఈ వేడుకలను తిలకించేందుకు భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. ఆలయంలో పత్రాలు, పుష్పాలు, ఫలాలు, విద్యుత్ దీపాలతో చేపట్టిన అలంకారం , స్వాగత తోరణాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రత్యేక బాణసంచా అలరించింది. ఈ కార్యక్రమంలో మంత్రి పెద్దిరెడ్డి సతీమణి స్వర్ణలతమ్మ, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, నవాజ్‌బాషా, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, టీటీడీ పాలక మండలి సభ్యుడు అశోక్‌కుమార్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, మాజీ ఎంపీపీ పెద్దిరెడ్డి ఇందిరమ్మ, పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, అభినయ్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు జింకాచలపతి, ఎంఆర్‌సీ రెడ్డి, కొండవీటి నాగభూషణం, బోయకొండ ఆలయ చైర్మన్ మిద్దింటి శంకర్‌నారాయణ, బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శరణమప్పా.. అయ్యప్పా!



సదుం మండలం ఎర్రాతివారిపల్లెలోని అయ్యప్పస్వామి ఆలయంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శనివారం వేకువజామున ఇరుముడి చెల్లించారు. శుక్రవారం రాత్రి స్థానిక రామాలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి ఇరుముడి కట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో నెయ్యితో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. ఆయనతో పాటు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తదితరులు ఇరుముడులు చెల్లించారు. దీక్ష చేపట్టిన స్వాములు కూడా పెద్ద సంఖ్యలో ఇరుముడులు చెల్లించేందుకు ఆలయానికి తరలివచ్చారు. - సదుం

హైకోర్టు న్యాయమూర్తి కృపాసాగర్‌కు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఈఓ వెంకటేశు



గణనాథుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృపసాగర్, ఆంధ్రప్రదేశ్ సమాచార హక్కు చట్టం కమిషనర్ చెన్నారెడ్డి శనివారం దర్శించుకున్నారు. వారు కుటుంబ సమేతంగా స్వామివారి దర్శనార్థం విచ్చేశారు. ఆలయ ఈఓ వెంకటేశు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు.



రాష్ట్ర సమచార హక్కు చట్టం కమిషనర్ చెన్నారెడ్డితో ఆలయ ఈఓ వెంకటేశు, ఆర్డీఓ రేణుక తదితరులు

ఇరుముడి చెల్లించిన జెడ్పీ చైర్మన్



వి.కోట: సదుం మండలం ఎర్రాతివారిపాళెంలోని అయ్యప్పస్వామిని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు శనివారం దర్శించుకున్నారు. ముందుగా ఆయన స్వగ్రామం కొత్తూరులో ఇరుముడి కట్టుకుని బయలుదేరారు. స్వామిని సేవించుకున్న తర్వాత ఇరుముడి చెల్లించారు.

జీఓ తగులబెట్టడం చంద్రబాబు అహంకారానికి నిదర్శనం

- పవన్ కల్యాణ్ సినిమాల్లో హీరో.. రాజకీయాల్లో జోకర్
- సభల్లో జరిగిన మరణాల చర్చ దారి మళ్లించేందుకే యువశక్తి సభ
- మంత్రి ఆర్కే రోజా



మాట్లాడుతున్న మంత్రి రోజా

నగరి: జీవో నంబర్ 1 తగులబెట్టడం చంద్రబాబు అహంకారానికి నిదర్శనమని మంత్రి ఆర్కే రోజా విమర్శించారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జీవో 1లో పేర్కొన్న అంశాలపై ఆయనకు స్పష్టత లేదు కనుక ఇలా ప్రవర్తిస్తున్నారని చెప్పారు. సభలు పెట్టొద్దని ఎవరూ చెప్పడం లేదని ప్రజలకు ప్రాణహాని లేకుండా సభలు పెట్టుకోమని జీవో నెంబర్ వన్ ఉద్దేశం అని స్పష్టం చేశారు. ప్రజలు మృతిచెందినా పర్వాలేదనీ.. ఇరుకు సందుల్లోనే సభలు పెడతా అన్న ధోరణిలో చంద్రబాబు ఉన్నారన్నారు. ఆయన సభలో జరిగిన దుస్సంఘటనల చర్చల నుంచి ప్రజలను దారి మళ్లించడానికి పవన్‌కల్యాణ్ యువశక్తి సమావేశాన్ని నిర్వహించారన్నారు. సమావేశంలోనూ రోజా, అంబటి, అమర్నాథ్ అన్న పేర్లు చెప్పినప్పుడే జనం చప్పట్లు కొట్టారన్నారు. అది వైఎస్సార్‌సీపీ నాయకులకు ప్రజల్లో ఉన్న క్రేజ్ అన్నారు. ఏ హీరో అయినా రాజకీయాల్లో వచ్చినప్పుడు తానే ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటారని.. అయితే పవన్ కల్యాణ్ మాత్రమే పక్కనున్న వ్యక్తి ముఖ్యమంత్రి కావాలని కోరుతున్నారన్నారు. ఆయన సినిమాల్లో హీరో అయితే.. రాజకీయంలో జోకర్ అని ఎద్దేవా చేశారు. విడిపోయిన రాష్ట్రానికి అనుభవజ్ఞుడని చంద్రబాబు నాయుడుకు అవకాశం ఇస్తే ఆయన రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచేసి వెళ్లారన్నారు. ఆ పరిస్థితుల్లో ముఖ్యమంత్రి అయిన జగనన్న తన విజన్‌తో ఇచ్చిన హామీల్లో 98 శాతం నెరవేర్చి అత్యున్నత పాలనను అందిస్తున్నారన్నారు. నేడు రాష్ట్రం జీడీపీలో నంబర్ వన్ స్థానంలో ఉందని, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా జగనన్నను ఫాలో అవుతున్నారని అన్నారు.

నేను డైమండ్ రాణినే

తాను ఇంట్లోను, సినిమా ఇండస్ట్రీలోను, రాజకీయాల్లోనూ సక్సెస్‌ఫుల్ డైమండ్ రాణినే అని మంత్రి రోజా పవన్ కళ్యాణ్ మాటలకు కౌంటర్ ఇచ్చారు.

బోల్తాపడిన కోకాకోలా వాహనం

- ఇద్దరికి తీవ్ర గాయాలు
- కూల్‌డ్రింక్ బాటిళ్లు ఎత్తుకుపోయిన స్థానికులు



రోడ్డున పడిన కూల్‌డ్రింక్ బాటిళ్లు, (ఇన్‌సెట్) అపస్మారకస్థితిలో క్షతగాత్రుడు యశ్వంత్

శాంతిపురం: మండలంలోని కూతేగానిపల్లి వద్ద పలమనేరు జాతీయ రహదారిలో కారు ఢీకొనడంతో కోకాకోలా ఉత్పత్తులతో వెళ్తున్న వాహనం బోల్తాపడింది. ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించకుండా రోడ్డుపై పడిన కోకాకోలా సాఫ్ట్ డ్రింక్ బాటిళ్లను దర్జాగా ఎత్తుకెళ్లారు. పోలీసుల కథనం మేరకు.. దుకాణాలకు కోకాకోలా సాఫ్ట్ డ్రింక్ బాటిళ్లను సరఫరా చేసేందుకు కుప్పం నుంచి మినీ టెంపో శనివారం శాంతిపురం మండలానికి వచ్చింది. తిరిగి వెళుతుండగా కూతేగానిపల్లి వద్ద కారు ఢీకొనడంతో బోల్తా పడింది. అందులో ఉన్న కుప్పానికి చెందిన యశ్వంత్, హరీష్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. యశ్వంత్‌పై బాటిళ్ల కేస్‌లు పడడంతో అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. అతన్ని రోడ్డు పక్కన వెళుతున్న కొందరు బయటకు తీశారు. పదుల సంఖ్యలో అక్కడికి చేరుకున్న జనం అందిన కాడికి బాటిళ్లు తీసుకుని వెళ్లిపోయారు. అనంతరం సమాచారం అందుకున్న 108 సిబ్బంది అక్కడికి చేరుకుని గాయపడిన వారిని కుప్పం ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై రాళ్లబూదుగూరు పోలీసులు విచారణ చేస్తున్నారు.

కమనీయం గోదాదేవి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

గుడుపల్లె: మండలంలోని కనమనపల్లెలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాస స్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ధనుర్మాసం ప్రారంభం నుంచి గోదాదేవికి ప్రత్యేక పూజలు జరిపిస్తున్నారు. మాసం చివరి రోజైన భోగి పండుగ నాడు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛారణ నడుమ శ్రీకృష్ణుడు, గోదాదేవికి కల్యాణం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

అయ్యప్ప దేవాయ నమః..

నగరి: పట్టణ పరిధి బైపాస్ సర్కిల్ సమీపంలోని శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో, శ్రీకరకంఠేశ్వరస్వామి ఆలయ ప్రా కారంలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో, సత్రవాడ అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం మకర జ్యోతి పూజలు వైభవంగా జరిగాయి. ఆలయా లు భక్తులతో కళకళలాడాయి. అయ్యప్పస్వామి, విఘ్నేశ్వర, సుబ్రమణ్యస్వామి విగ్రహాలను, 18మెట్లను పుష్పాలతో ప్ర త్యేకంగా అలంకరించారు. అఖండ దీపం వెలిగించి పూజలు చేశారు. అఖండ దీపంతో ఆలయ ప్రాకారాలను ప్ర దక్షిణ చేయడం ప్రత్యేకతను సంతరించుకుంది. అన్నదానం చేశారు. రాత్రి అ య్యప్ప, విఘ్నేశ్వర, సుబ్రమణ్యస్వామి ఉత్సవమూర్తులను విద్యుద్దీపాలంకరణలు, బాణ సంచా పేలుళ్ల సందడి నడుమ పట్టణ పరిధిలో ఊరేగించారు. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పించారు.

వేడుకగా గోదాదేవి పరిణయోత్సవం

పిచ్చాటూరు: నాగలాపురం శ్రీ వేదనారాయణస్వామి సన్నిధిలో గోదాదేవి పరిణయోత్సవాన్ని అర్చకులు శనివారం వేడుకగా నిర్వహించారు. ఉదయం ధనుర్మాస పూజలు, తిరుప్పావై అనంతరం గోదాదేవిని పంచ తీర్థాలతో అభిషేకించి, తిరుచ్చిపై ఆశీనులు చేసి ప్రాకారోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయానికి చేరుకున్న ఆండాళ్‌కు వేద నారాయణునితో కల్యాణోత్సవం నిర్వహించారు. రాత్రి నవ వధూవరులిద్దరికీ విశేష అలంకరణ చేసి, పల్లకిపై అధిష్టింపజేసి తిరు వీధుల్లో ఊరేగించారు. ఏర్పాట్లను ప్రధాన అర్చకులు నాగరాజ భట్టాచార్య పర్యవేక్షించారు.



నాగలాపురం : తిరుచ్చి వాహనంపై ఊరేగుతున్న గోదాదేవి సమేత వేదనారాయణస్వామి

వెంకన్న ఆలయంలో భోగి ఉత్సవం



తిరుచ్చిపై గోదాదేవితో కల్యాణ వెంకన్న

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భోగి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం 4.30 గంటలకు తిరుప్పావైతో స్వామిని మేల్కొలిపిన అర్చకులు నిత్య పూజా కైంకర్యాలు, ధనుర్మాస పూజలను నిర్వహించారు. ఆలయం ఎదుట భోగి మంటలు వేశారు. ఉదయం 8 గంటలకు ఆండాళ్ అమ్మవారికి స్నపన తిరుమంజనం నిర్వహించి ధూప దీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం గోదాదేవి(ఆండాళ్) కల్యాణ వెంకటేశ్వరస్వామి తిరుచ్చి వాహనంపై పురవీధుల్లో మేళతాళాల నడుమ విహరించారు. ఆ తర్వాత ఆలయానికి చేరిన ఉత్సవమూర్తులకు ఆస్థాన మండలంలో భోగి ఆస్థానం నిర్వహించి నైవేద్యం సమర్పించారు. నిర్వహించారు. ఆలయ అధికారి నాగరాజు, భద్రతా జమేదార్ విజయకుమార్‌లు తదితరులు పర్యవేక్షించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర భట్టాచార్య మాట్లాడుతూ మకర సంక్రాంతి సందర్భంగా ఆదివారం సాయంత్రం ఉభయ నాంచారుల సమేత కల్యాణ వెంకన్న ప్రాకార ఊరేగింపు, కనుమ రోజైన శుక్రవారం సాయంత్రం గోదాదేవి పరిణయోత్సవాన్ని ఆలయ సన్నిధి వీధిలో నిర్వహించనున్నట్లు చెప్పారు.

పట్టువస్త్రాల సమర్పణ

భోగి పండుగ పురస్కరించుకుని స్థానిక వీరరాఘవ స్వామి దేవస్థానం తరఫున పట్టుశాలీలు వస్త్రాలను ఊరేగింపుగా తీసుకువచ్చి పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామికి సమర్పించారు.

క్లుప్తంగా

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు



శ్రీవారి ఆలయం ఎదుట తమిళనాడు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వైద్యనాథన్

తిరుమల: తిరుమల శ్రీవారిని శనివారం తమిళనాడు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వైద్యనాథన్, ఎమ్మెల్యే వల్లభనేని వంశి, కర్ణాటక ఎంపీ ఉమేష్‌జాదవ్, ఎమ్మెల్యే వెంకట సతీష్‌కుమార్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

కర్మఫలానికి ఎవరూ అతీతం కాదు

- దీనిని తప్పులకు ప్రతిఫలంగా భావించరాదు
- పుత్రశోకంతో ఉన్న ధర్మారెడ్డికి బాసటగా నిలవడం బాధ్యత
- బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు





సమావేశంలో మాట్లాడుతున్న చాగంటి కోటేశ్వరరావు, హాజరైన ప్రజలు, అధికారులు

తిరుచానూరు: కర్మఫలానికి ఎవరూ అతీతం కాదని, తాను చేసిన కర్మఫలాన్ని పూర్తిచేసుకొని టీటీడీ ఈఓ ధర్మారెడ్డి కుమారుడు దివంగతులయ్యారని, దీనిని తప్పులకు ప్రతిఫలంగా భావించడం భావ్యం కాదని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ఉద్ఘాటించారు. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీటీడీ ఈఓ ధర్మారెడ్డి కుమారుడు చంద్రమౌళిరెడ్డి సంస్మరణ సభ శనివారం ఎస్వీయూ శ్రీనివాస ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన చాగంటి కోటేశ్వరరావు మనిషి పుట్టుక, కర్మఫలం, మరణం వంటి వాటి గురించి విశదీకరించారు. కలియుగ క్షేత్రంలో వెలిసిన దేవుడు ఎవ్వరినీ బాధ పెట్టడని, అందరినీ కాపాడడమే పనిగా అవతరించారని తెలిపారు. ఎవరైనా తప్పులు చేస్తే భగవంతుడు శిక్షించడని, ఏదో ఒక రూపంలో సరిచేసేలా చెప్తాడన్నారు. దేవునిపై అసత్య ప్రచారం చేస్తే ప్రజల విశ్వాసం దెబ్బతింటుందన్నారు. ధర్మారెడ్డి కుమారుడు ఖర్మఫలం పూర్తి చేసుకుని వెళ్లాడు తప్ప ఆయన తండ్రి చేసిన తప్పులకు దేవుడు వేసిన శిక్ష అనడం మూర్ఖత్వమన్నారు. పుత్రశోకంతో బాధపడుతున్న ధర్మారెడ్డి దంపతులకు ప్రతిఒక్కరూ బాసటగా నిలవాలని ఆకాంక్షించారు.



రక్తదాన శిబిరంలో టీటీడీ ఈఓ ధర్మారెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

బాధలోనూ భగవంతుని సేవ

పుత్ర శోకం నుంచి తేరుకోకముందే స్వామి చెంతకు వచ్చి భక్తులకు సేవ చేయడం టీటీడీ ఈఓ ధర్మారెడ్డి ఆత్మస్థైర్యానికి నిదర్శమని చంద్రగిరి ఎమ్మెల్యే, తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. భక్తుల కోసం నిత్యం పరితపించే ఈఓ కుటుంబానికి కష్టం వస్తే అండగా నిలిచేందుకు వచ్చిన ప్రతిఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

స్వచ్ఛంద రక్తదానం

టీటీడీ ఈఓ ధర్మారెడ్డి కుమారుడు చంద్రమౌళిరెడ్డి సంస్మరణ సభ సందర్భంగా టీటీడీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

ఇందులో నా స్వార్థం ఏముంది?



ధర్మారెడ్డిని ఓదార్చుతున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

ఖర్మఫలంతో నా బిడ్డ చనిపోతే స్వామి సన్నిధిలో తప్పులు చేసినందుకు దేవుడు శిక్ష వేశాడని తనపై అభాండాలు వేయడం తన మనస్సును కలచి వేసిందని టీటీడీ ఈఓ ధర్మారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా తనపై మూడు ఆరోపణలు వచ్చాయని తెలిపారు. ఇందులో శ్రీవారి ఆలయం నుంచి పరకామణిని బయటకు పంపడం, శ్రీవారికి తిరుప్పావై సేవను రద్దు చేయడం, తమ స్వగ్రామంలో శిథిలమైన నాగుల కట్ట, వేణుగోపాలస్వామి ఆలయ జీర్ణోద్ధరణ కోసం విగ్రహాలను తొలగించడం లాంటివి ఉన్నాయన్నారు. ఇందులో తన స్వార్థం ఏమి ఉందో భక్తులు ఆలోచించాలన్నారు. ఇవన్నీ భక్తుల సౌకర్యార్థం ఆగమ పండితుల సలహాలు, మీడియా, పాలక మండలి ప్రతినిధుల ఆమోదంతో తీసుకున్న నిర్ణయాలని స్పష్టం చేశారు. తప్పుచేసి ఉంటే తన భార్య నిత్యం భగవంతుని పూజలో ఉంటుందని, అలాంటప్పుడు ఆమెకు పుత్ర శోకం ఎందుకు కలిగించినట్లు అని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తనలో కలిగిన ఈ ప్రశ్నలకు సమాధానం కావాలంటే తిరుపతిలో ఒక సంస్మరణ సభ ఏర్పాటు చేయండి, అక్కడికి తాను వచ్చి ప్రసంగిస్తానని చాగంటి కోటేశ్వరరావు చెప్పారని గుర్తుచేశారు. ఈ తరుణంలో దేవుడిచ్చిన తమ్ముడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తన బాధలో భాగం పంచుకున్నారని తెలిపారు. ఖర్చుతో కూడుకున్నప్పటికీ ఇంత పెద్దగా సంస్మరణ సభ పెట్టి తనకు బాసటగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి నారాయణ స్వామి, శాంతాబయోటిక్ అధినేత పద్మభూషణ్ వరప్రసాద్‌రెడ్డి, టీటీడీ జేఈఓలు వీరబ్రహ్మం, సదాభార్గవి, మాజీ శ్వేత డైరెక్టర్ భూమన్, ఎస్వీ పరమేశ్వరరెడ్డి, సీవీఎస్‌ఓ నరసింహ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



నృత్యప్రదర్శనలో కళాకారులు

సంక్రాంతి సంబరాల్లో భాగంగా తొలిరోజు భోగి పండుగ నాడు శనివారం శిల్పారామంలో కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను అలరింపజేశాయి. ఇందులో భాగంగా ఉమాదేవి బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. పుష్పాంజలితో మొదలైన నృత్యరూపకాలు, ముద్దుగారే యశోద.., శివతాండం...., తిరు తిరు జవరాలా...., వచ్చెను అలిమేలు మంగ... వంటి సంకీర్తనలకు కళాకారులు లయబద్ధంగా చక్కటి హావభావాలతో నర్తించి చూపరులను మంత్రముగ్ధుల్ని చేశారు.

- తిరుచానూరు

భోగి మంటలు.. సరికొత్త వెలుగులు!



సత్యవేడు: రాజుగుంట వీధిలో భోగి మంటల్లో నీళ్లు కాచుకుంటున్న స్థానికులు



వి.కోట: భోగి మంటలు వేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

జిల్లాలో భోగి పండుగను శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం భోగిమంటలేసి, తలంటు స్నానాలు చేసి, కొత్త దుస్తులు ధరించి పండగ చేసుకున్నారు. అనంతరం పలువురు ఆలయాల బాట పట్టగా, మరికొందరు గాలిపటాలు ఎగురవేస్తూ సందడి చేశారు.

- సాక్షి, తిరుపతి



సత్యవేడు: గొబ్బి ఆడుతున్న మహిళలు



తిరుపతి: భోగి మంట వేస్తున్న ఎంపీ గురుమూర్తి

4 దశాబ్దాల తర్వాత అ'పూర్వ' కలయిక

బంగారుపాళెం: 40 ఏళ్ల క్రితం 10వ తరగతి చదివిన విద్యార్థులు శనివారం కలుసుకున్నారు. మండలంలోని గుండ్లకట్టమంచి జెడ్పీ హైస్కూలు దీనికి వేదికైంది. ఇక్కడ 1979–80లో 10వ తరగతి చదివిన వారంతా కాలక్రమంలో వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. సంక్రాంతి పండుగ రోజు అప్పటి బ్యాచ్ వారంతా కలిశారు. జ్ఞాపకాల పూదోటలో విహరించారు. తమ ఉన్నతికి బాటలు వేసిన గురువులను స్మరించారు.

కల్యాణ వైభోగమే..!

చిత్తూరు రూరల్: చిత్తూరులోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో శనివారం శ్రీగోదారంగనాథుల తిరుకల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. తొలుత కోదండరాముడికి ప్రత్యేక అభిషేక పూజల అనంతరం గోదారంగనాథ స్వామి ఉత్సవమూర్తులను అలంకరించి కల్యాణవేదికపై ఆశీనులు చేశారు. చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు స్వామి వారికి మేళతాళాల నడుమ పట్టువస్త్రాలను సమర్పించారు. వేదపండితులు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. తదనంతరం పల్లకిలో స్వామివార్లను ఊరేగించారు. కార్యక్రమంలో చైర్మన్ వెంకటేష్‌గుప్తా, అర్చకులు వేణుగోపాల్, సభ్యులు రాజా, హేమాద్రి, మాధవి, ఈశ్వరి, దుర్గాదేవి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జ్యోతి దర్శనం

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం ప్రశాంత్‌నగర్‌లోని శ్రీ శాస్త్రగిరి అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం జ్యోతి దర్శనం కల్పించారు. స్వామి వారిని ఈశ్వరగుడి వీధి నుంచి బజారువీధి, హైరోడ్డు, గిరింపేట, ప్రశాంత్‌నగర్ మీదుగా ఆలయం వరకు కేరళవాయిద్యాల నడుమ ఊరేగించారు. అనంతరం ఆలయంలో మకర జ్యోతి దర్శన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం





కేటీ రోడ్డులోని వరదరాజస్వామి ఆలయంలో గోదాదేవి నవనీత కృష్ణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు, స్వామి,అమ్మవార్ల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

తిరుపతి కల్చరల్: కేటీ రోడ్డులోని శ్రీవరదరాజ స్వామి ఆలయంలో చిన్నజీయర్ స్వామి ఆధ్వర్యంలో శనివారం శ్రీగోదాదేవి కల్యాణోత్సవం వేడుకగా నిర్వహించారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకొని ఆలయంలో గత నెల 17 నుంచి తిరుప్పావై ప్రవచనాలు చేపట్టారు. .ధనుర్మాసం చివరిరోజైన భోగి పండుగ నాడు శనివారం ఆలయంలో శ్రీగోదాదేవి కల్యాణం చేపట్టారు. శ్రీగోదాదేవి, శ్రీరంగనాథస్వామి వారిని సర్వాంగసుందర అలంకరణలో ఆలయ ఆవరణలోని మండపానికి వేంచేపు చేశారు. అక్కడ వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ శ్రీగోదాదేవి కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాలుదువ్వి.. రంకెలేసి !



దప్పుకొట్టు.. ఉత్సాహం నింపేటట్టు



బహుమతులు ఇవ్వు పలక!

తిరుపతి జిల్లా, చంద్రగిరి నియోజకవర్గం, రామచంద్రాపురం మండలంలోని అనుప్పల్లెలో శనివారం ఎద్ల పందేలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. కాలు దువ్వుతూ.. రంకెలేస్తూ.. దూసుకొస్తున్న కోడెగిత్తలను నిలువరించేందుకు యువకులు పోటీ పడ్డారు. అంతకుముందు ఎద్ల కొమ్ములు చివ్వి, రంగులు పూసి, రిబ్బన్లు కట్టి ముస్తాబు చేశారు. అపై పలకలు కట్టి, బహుమతులు ఉంచి, దప్పుకొట్టి జనంలోకి వదిలారు. వీటిని కైవశం చేసుకునేందుకు యువకులు ఆసక్తి చూపారు. పోట్లగిత్తలను నిలువరించే ప్రయత్నంలో కొందరికి గాయాలయ్యాయి. ఎద్ల పందేలను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో జనం తరలివచ్చారు. వీరికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు చర్యలు చేపట్టారు.

- రామచంద్రాపురం



నువ్వా..నేనా: పోట్లగిత్తను నిలువరిస్తున్న యువత



బహుమతులు సొంతం చేసుకునేందుకు పోటీ..



పోటాపోటీగా..



దూసుకొస్తున్న కోడెగిత్తలు



పందేలకు సిద్ధమైన పోట్లగిత్తలు



జనంపైకి తిరగబడ్డ కొడెగిత్త